క్లుప్తంగా

జగన్‌తో వైవీఆర్ భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతీరెడ్డి

గుంతకల్లు: గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మంగళవారం తన కూతురు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డితో కలసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ స్థితిగతులపై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ప్రతి కార్యకర్తకూ అండగా నిలవాలని, త్వరలోనే వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం వస్తుందని వైవీఆర్‌కు జగన్ భరోసా ఇచ్చారు.

మాజీ సీఎంను కలసిన పామిడి వీరా



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన పామిడి వీరా, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ

పామిడి: తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసినట్లు ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఏపీలో పార్టీ పరిణామాలపై సీఎం చర్చించారన్నారు. తనతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మల్లికార్జున, మహేంద్ర తదితరులు పాల్గొన్నారన్నారు.

ఘనంగా బాట సుంకులమ్మ జాతర



అలంకరణలో బాట సుంకులమ్మ

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో మంగళవారం జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచి అభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు.

సాయిబాబా ఆలయంలో రేపు ప్రత్యేక కార్యక్రమాలు

గుత్తి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జేకె రాము పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తాలు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా జీవించండి

పుట్లూరు: వివాదాలకు దూరంగా ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. మంగళవారం ఓ కేసు విచారణ నిమిత్తం ఆయన మండలంలోని శనగలగూడూరులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. చిన్న పాటి కారణాలతో ఘర్షణలకు దిగరాదన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈయన వెంట ఎస్‌ఐ హేమాద్రి ఉన్నారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి



మృతిచెందిన జింక

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో మంగళవారం కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందింది. గ్రామ సమీపంలోని పొలాల్లో సంచరిస్తున్న జింకపై ఉన్నఫళంగా వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన రైతులు కుక్కల బారి నుంచి జింకను కాపాడి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకుని గాయపడిన జింకకు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కాసేపటికే జింక మృతి చెందింది.

భూసార పరీక్ష.. పంటకు రక్ష

- తక్కువ పెట్టుబడులతో మేలైన పంట దిగుబడులు
- రసాయనిక ఎరువుల వినియోగంతో భూములు నిస్సారం



పొలంలో భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

తాడిపత్రిటౌన్: భూసార పరీక్షలే పంటలకు శ్రీరామరక్ష అని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. విపరీతమైన రసాయనిక ఎరువుల వినియోగంతో భూములు నిస్సారం అవుతున్నాయి. తక్కువ పెట్టుబడులతో మేలైన దిగుబడులు సాధించాలంటే మూడు సంవత్సరాలకు ఒకసారి రైతులు పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. భూసార పరీక్షలపై అన్నదాతలకు అవగాహన లేకపోవడంతో పంటలకు విపరీతంగా రసాయనిక ఎరువులను వినియోగించి పెట్టుబడులను అధికం చేసుకుంటున్నారు. సరైన దిగుబడులు రాక...వచ్చినా సరైన ధరలు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల తో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. నియోజకవర్గంలోని తాడిపత్రి మండలంలో 8,650 హెక్టార్లు, పెద్దపప్పూరు మండలం 4,350 హెక్టార్లు, పెద్దవడుగూరు మండలం 14,575 హెక్టార్లు, యాడికి మండలంలో 10,500 హెక్టార్లలో పత్తి, వేరుశనగ, కంది, కొర్ర, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేయనున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వలన భూమిలో పోషకాలు నశించి నిస్సారం అవుతోందన్నారు. విపరీతమైన పోటాష్ వాడకం వల్ల సూక్ష్మ పోషకాలైన మెగ్నిషియం, ఐరన్, జింక్ పంటలకు అందకుండా పోతున్నాయి. మొక్కలు ఎదగకుండా పోవడంతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సేంద్రియ కర్బనం లోపించడం వల్ల భూమి తన సహజ స్వభావం కోల్పోతుంది. ఎంత ఎరువులు వేసినా భూమి వాటిని గ్రహించకుండా నిస్సారం అవుతున్నాయి. దీంతో పంట దిగుబడులపై విపరీతమైన ప్రభావం కనపడుతోంది. మూడేళలకు ఒకసారి పొలంలో భూసార పరీక్షలు చేయించి.. నేల స్వభావం, పోషక విలువల స్థాయి తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా పంటల సాగు, తగిన మోతాదులో ఎరువుల వినియోగించడం వలన మేలైన దిగుబడులే కాక పంట పెట్టుబడులు కూడా తగ్గుతాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాం. ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. చాలామంది రైతులు ఎలాంటి భూసార పరీక్షలు లేకుండానే పంటలు సాగు చేస్తూ విపరీతమైన ఎరువుల వినియోగంతో పాటు పెట్టుబడులు పెంచుకుంటున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం ద్వారా భూమి నిస్సారం అవుతుంది. భూసార పరీక్షలు చేయించి తదనుగుణంగా పంటలు సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడమే కాకుండా మేలైన దిగుబడులతో పాటు మంచి లాభాలు అర్జించవచ్చు.

– మహితా కిరణ్ ఏఓ తాడిపత్రి

కుక్కలతో జనం బెంబేలు



రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

గుత్తి: గుత్తిలో కుక్కల బెడద అధికమైంది. కుక్కలు వాహనాల వెంట పడుతుండటంతో చోదకులు భయాందోళన చెందుతున్నారు. గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, రాయల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో కుక్కల బెడద అధికమైంది. ఆటో, కారు, ద్విచక్ర వాహనాలు వెళుతున్న సమయంలో కుక్కలు వెంట పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల



అధ్వానస్థితిలో పశువైద్యశాల

యల్లనూరు: మండల కేంద్రంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళనలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అక్కడక్కడా పైకప్పు పెచ్చులూడి మీదకు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలకు వైద్యమందించే పశువైద్యశాల చిన్నపాటి వర్షాలకు అక్కడక్కడ కారుతున్నా ఉద్యోగులు అలాగే నెట్టుకొస్తున్నారు. అసలే వర్షాకాలం. ఒకవైపు పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి. పలుమార్లు నూతన భవనం మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి యల్లనూరులో నూతన పశువైద్యశాలను నిర్మించాలని లైవ్ స్టాక్ అసిస్టెంట్ రేష్మ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసులరెడ్డి కోరారు.

కూలీల వలసలు నివారించాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

శింగనమల: జిల్లాలో వ్యవసాయ కార్మికులకు పనులు లేక వలసలు పోతున్నారని, ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. మంగళవారం మండలంలోని రాచేపల్లి, సలకంచెరువు గ్రామాల్లో ఉపాధి కూలీలతో సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా మందికి వంద రోజులు పని దినాలు పూర్తయ్యాయని, 200 రోజుల పని దినాలకు పెంచాలన్నారు. రోజుకు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కూలీలకు గడ్డ పారలు, మెడకల్ కిట్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న, రామాంజనేయులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: మండలంలోని మోడల్ స్కూల్‌లో 2024–2025 సంవత్సరానికి 7, 8, 9వ తరగతులకు సంబంధించి 6 ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ మంగళవారం తెలిపారు. 7వ తరగతిలో జనరల్–1 సీటు, 8వ తరగతిలో జనరల్–4, 9వ తరగతిలో జనరల్–1 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 19వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తులకు కళాశాలలో సంప్రదించాలన్నారు. అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యాడికి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతిలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మారుతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తులను పాఠశాఆలలో అందజేయాలన్నారు. విద్యార్థి చదువుతున్న పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి, తల్లి, తండ్రి ఆధార్ కార్డుల జిరాక్స్‌లు , రెండు ఫోటోలు పాఠశాలకు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలనానరు. పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామన్నారు. పరీక్ష ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తామన్నారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తరిమెలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ముఖ్యంగా మలేరియా రాకుండా ప్రజలు నివారణ చర్యలు తీసుకోవాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని తరిమెల గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలో ఆరోగ్యకేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గంగాధర, సూపర్‌వైజర్ అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా

పామిడి: ఏపీ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి కుర్నీ, కరికల వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఆర్‌కే దత్తు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను విజయవాడ బీసీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపినట్లు ఆయన తెలిపారు. ఇన్నాళ్లూ తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌కో కాంట్రాక్టర్ మృతి



నరసింహులు (ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ట్రాన్స్‌కో క్లాస్–1 కాంట్రాక్టర్ నరసింహులు(65) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అతడు అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. కుటుంబీకులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నరసింహులు మృతి పట్ల ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



లారీకింద పడి వ్యక్తి మృతి చెందిన దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు –గుత్తి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి (35)మృతిచెందాడు. స్కూటీలో ఓ వ్యక్తి గుంతకల్లు వైపు నుంచి గుత్తి వైపు వెళ్తున్నాడు. అతడు నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీకి సైడ్ వదిలే ప్రయత్నంలో పక్కనున్న మట్టిదిబ్బను ఎక్కించాడు. స్కూటీ అదుపు తప్పడంతో అతడు లారీ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మూడు బస్సుల సీజ్

తాడిపత్రి: మండల పరిధిలోని ఆర్జాస్ స్టీల్ పరిశ్రమకు కాంట్రాక్ట్ విధానంలో నడుపుతున్న 3 బస్సులను బుధవారం తాడిపత్రి ఎంవీఐ అధికారులు సీజ్ చేశారు. పరిశ్రమలో కాంట్రాక్ట్ కింద నడుపుతున్న బస్సుల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లుగా గుర్తించి, చర్యలు తీసుకున్నామని ఎంవీఐలు శ్రీనివాసులు, రాజగోపాల్ తెలిపారు.

జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని 44 జాతీయ రహదారిపై ఉన్న క్వాలిటీ రెస్టారెంట్‌కు దగ్గరలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రోడ్డు పక్కగా వెళుతున్న వారు దుర్వాసనను పసిగట్టి పరిశీలించడంతో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పెద్దవడుగూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మూడు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. దాదాపు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, క్రీమ్ కలర్ ప్యాంట్, రెండు షర్టులు ధరించినట్లుగా గుర్తించారు. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే పెద్దవడుగూరు పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు కోరారు.

పామిడిలో మోస్తరు వర్షం



మడుగును తలపిస్తున్న బీసీసీరోడ్డు

పామిడి: పామిడిలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, వెంగమనాయుడు కాలనీ, సీఎస్‌ఐ చర్చి తదితర వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపై ఉన్న గుంతలు వర్షపునీటితో నిండాయి. గుత్తి బీసీసీరోడ్డు మడుగును తలపించింది. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. ఉక్కపోతతో అల్లాడుతున్న జనం వేడిమి నుంచి ఉపశమనం కలిగింది. ఈ వర్షంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం



అలంకరణలో సత్యనారాయణస్వామి



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన వరలక్ష్మీదేవి, సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ గోపుర కలశాలకు భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో గురుపూజ, గణపతి వందనం, నాంది, రక్షాబంధనం, అంకుర్పాణ జరిగింది. అమ్మ వారి కలశాలను మహిళలు ఊరేగింపు ఆలయానికి తీసుకొచ్చారు. గంగ, సరస్వతీ, యుమున, నర్మదా, సింధూ, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, కావేరి, బ్రహ్మపుత్ర, సరయు, కైలాసపర్వత, మానససరోవరం జలాలతో ఆలయ గోపుర కలశాలకు కుంభాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా మహా గణపతి పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు నిశ్చితార్థం, 13న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మి రథోత్సవం



భక్త జన సందోహం మధ్య కొల్లాపురి మహాలక్ష్మి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం మంగళవారం సాయంత్రం గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం గంగా జలంతో అమ్మవారిని అభిషేకించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 101 మంది గొరవయ్యల నృత్యం, నందికోలు, వీరభద్ర కుణిత, మహిళా విరకాశి నాట్యాల మధ్య రథోత్సవం నిర్వహించారు. ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్ ఎస్‌ఐలు శ్రీనివాసులు, గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

వేలిముద్రలు ఇప్పుడు.. రేషన్ ఎప్పుడో?

- ఆందోళనలో చుక్కలూరు గ్రామస్తులు



వేలిముద్ర వేసేందుకు పడిగాపులు కాస్తున్న రేషన్ లబ్ధిదారులు



రేషన్‌కు బదులు కాటాలో కిలో రాళ్లను ఉంచిన దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని చుక్కలూరు గ్రామంలో ఉన్న రేషన్ డిపోలో వేలిముద్రలు తీసుకొని సరుకులు ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని అందరి వేలు ముద్రలు తీసుకున్న తర్వాత సరుకులు అందజేస్తామని డీలర్ చెబుతున్నాడని లబ్ధిదారులు వాపోయారు. అధికారులు సైతం అటువైపు వెళ్లక పోవడంతో గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద చిన్న పిల్లవాడితో లబ్ధిదారులతో వేలి ముద్రలు తీసుకుంటున్నారు. కాటాలో సరుకులకు బదులుగా కిలో రాళ్లను పెట్టి రేషన్ ఇచ్చినట్లుగా నమోదు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి లబ్ధిదారులకు రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.